క్లుప్తంగా

బీసీ కులాలు సంఘటితం కావాలి



కాజీపేట రూరల్: బీసీ కులాలన్నీ సంఘటితం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ సూచించారు. కొలనుపాకలోని మేరు సంఘం రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి తరలివెళ్లే మేరు సంఘం సభ్యుల వాహనాలను కాజీపేట ఫాతిమానగర్‌లో మేరు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో రవికృష్ణ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 136 బీసీ కులాలు సంఘటితమై రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు తాళ్ల దయానంద్, రాపర్తి సుధాకర్, గట్ల రమేష్, గట్ల నాగేశ్వర్‌రావు, గూడూరు బాలాజీ, కన్నె రవీందర్, సుధాకర్, తాళ్ల శ్రీనివాస్, గట్ల వేణుమాధవ్, బొమ్మదేవి రామ్మోహన్, రమేష్ పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం



హసన్‌పర్తి: సంత్ సేవాలాల్ మహరాజ్ మార్గం అనుసరణీయమని కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ అన్నారు. 56వ డివిజన్ గోపాలపురంలో సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వీరన్న నాయక్, ప్రధాన కార్యదర్శి దాసునాయక్, ఉపాధ్యక్షుడు రాంచందర్ నాయక్, సభ్యులు జవహర్‌నాయక్, రాజునాయక్, అజారాంనాయక్ పాల్గొన్నారు.

అతివేగం.. నలుగురికి గాయాలు

హసన్‌పర్తి: అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో బోల్తాపడిన లారీని కారు ఢీకొట్టిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. హనుమకొండ – ఎల్కతుర్తి మార్గమధ్యలోని అన్నాసాగరం వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ తెలిపారు. హనుమకొండ జులైవాడకు చెందిన ఎండి.జాన్ మహ్మద్, సైదాబేగం, ఎండి.ఇసాక్.. కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌లోని ఓ శుభకార్యానికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. అయితే అన్నాసాగరం సమీపంలో ఓ లారీ బోల్తాపడి ఉండడాన్ని గమనించకుండా డ్రైవర్ ఖలీల్ పాషా అతివేగంగా కారు నడిపి లారీని ఢీకొట్టాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం



కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని ఇంపీరియల్ కాలనీలో గుడిపాటి అశోక్ ఇంటిలో శనివారం షార్ట్ సర్క్యూట్ అయి గృహోపకరణాలు కాలిపోయాయి. ఫ్రిడ్జ్, టీవీ, మంచం, స్లాబ్ రోప్, దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల 50 వేల విలువైన ఆస్తి నష్టం జరిగిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై దాడి



మడికొండ: పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్ట్ చేసి సెల్ ఫోన్‌తో పాటు రూ.3,140 నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. మడికొండ శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా పసునూరి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వస్కుల కుమారస్వామి, దోమ నరేష్, జన్ను సాంబరాజు పరారైనట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, లవన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దర్శనానికెళ్తే అన్నీ అవస్థలే

ఖిలా వరంగల్: మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు దర్శనాకి వస్తే కనీస సౌకర్యాలు కల్పించకుండా ఆలయ కమిటీ సభ్యులు నిర్లక్ష్యం వహించారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. సౌకర్యాల కల్పనపై లేదన్నారు. స్వయంభూ శంభులింగేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో తాగునీరు, తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయడంలో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు విఫలమయ్యారని పలువురు వాపోయారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- వైభవంగా శివ, పార్వతుల కల్యాణం
- కిటకిటలాడిన ఆలయాలు
- శివుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- దర్శించుకున్న ప్రముఖులు



వేయిస్తంభాల గుడిలో పూజలు చేస్తున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, సీపీ రంగనాథ్ దంపతులు





కాశీ విశ్వేశ్వరాలయంలో మేయర్ సుధారాణి



వేయిస్తంభాల గుడిలో సాంస్కృతిక కార్యక్రమం

ఖిలా వరంగల్: మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని ఆలయాలు శివనామస్మరణతో శనివారం మార్మోగాయి. మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి, కరీమాబాద్ రోడ్డులోని బొమ్మగుడిలోని కాశీవిశ్వేశ్వరస్వామి, శివనగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేర్వేరుగా శివలింగాలకు పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈమేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు.. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది.

లింగోద్భావ పూజలో..

శనివారం రాత్రి 11నుంచి అర్ధరాత్రి 12.30 వరకు స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భావ కాలంలో వేదపండితులు భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

వరంగల్ శివనగర్‌లోని పంచముఖాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి వెంకటేశ్వరచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం జైశ్రీరాం భక్త మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

కాశిబుగ్గలో మహా శివరాత్రి వేడుకలు

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఐదు రోజుల నుంచి శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్వామి వారికి అర్చకులు తెల్లవారుజామున రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నగర మేయర్ గుండు సుధారాణి ఆలయానికి వచ్చి స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కాశిబుగ్గ ఓ సిటీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయంలో వేడుకలను నిర్వహించారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని పంచముఖ నాగవీరేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకుడు భోగేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

సంతాన లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని సంతాన లింగేశ్వర స్వామికి భక్తులు మహాన్యాస రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనులపండువగా శివ కల్యాణం

జులైవాడ: హనుమకొండ దర్గా బందం చెరువు సమీపంలోని శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్.. పూజలు చేశారు.

గురుధామంలో మహా లింగార్చన

వరంగల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో శనివారం మహాలింగార్చన, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ జన్మకు శివరాత్రి రోజు భక్తిశ్రద్ధలతో శివుడిని పూజిస్తే చాలు అని శివానందమూర్తి గురుదేవులు బోధించారని గుర్తుచేశారు. వేడుకలకు ఏపీ ఐఏఎస్ సీనియర్ అధికారి ఎల్వీ.సుబ్రహ్మణ్యం, నందన్, గురువు రెండో కుమారుడు కందుకూరి రాజశేఖర్, ట్రస్టీలు బండారు సాయి నారాయణ, గోపాల్‌రెడ్డి, సుదర్శన్ రావు, ఉమాశంకర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఏనుగులగడ్డలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పరమశివుడికి క్షీరాభిషేకం నిర్వహించారు. హనుమకొండ జిల్లా సెషన్ జడ్జి కృష్ణమూర్తి, హనుమకొండ ఏసీపీ కృష్ణ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాత్రి లింగోద్భావ పూజలు చేశారు.

ఫణిగల రామప్ప దేవాలయంలో..

మడికొండ: కాజీపేట మండలంలోని మడికొండ చెరువు కట్ట వద్ద ఉన్న కేదారేశ్వరస్వామి ఆలయంలో పూజారులు, అర్చకులు మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య శివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో కేదారేశ్వరస్వామి ఆలయంలో స్థానికులు దువ్వ శ్రీకాంత్, దువ్వ సందీప్, సాయి, రాజు, దువ్వ కృష్ణ, పైడిపాల రఘు – కల్పన దంపతులు, మురళి, శ్రీధర్, శ్రీకాంత్, స్థానికులు మినుగు కుమార్, మహేష్, రాఖీ, పాల్గొన్నారు.



కాశీ విశ్వేశ్వరాలయంలో కళాకారుల ప్రదర్శన



శంభునిగుడిలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

మల్లికార్జునస్వామి ఆలయంలో..

హసన్‌పర్తి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. కాగా, సిద్ధాపురంలోని కత్తెరశాల మల్లికార్జున స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హసన్‌పర్తిలోని శివాలయంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత రాజిరెడ్డి పూజలు చేశారు.

మార్మోగిన శివ నామస్మరణ

వరంగల్ చౌరస్తా: మహా శివరాత్రిని పురస్కరించుకొని 28వ డివిజన్‌లోని రామలింగేశ్వర ఆలయం, దుర్గేశ్వర స్వామి ఆలయం, స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీవిశ్వేర ఆలయ ప్రాంతాలు శివ నమస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకలు, అర్చనలు చేశారు.



హనుమకొండ సిద్ధేశ్వరాలయంలో..



కాజీపేట: శ్వేతార్కాలయంలో..



హనుమకొండ దర్గా బందం చెరువు సమీపంలో..



వరంగల్: సప్తగురుధామంలో మహాలింగార్చన



మడికొండలోని మెట్టుగుట్ట ఆలయంలో..



హసన్‌పర్తి: పూజలో ఎమ్మెల్యే అరూరి రమేష్



స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో..

ఉన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఖిలా వరంగల్: దేశవ్యాప్తంగా దళిత, మైనార్టీ మహిళలపై ఉన్మాద దాడులు ఎక్కువయ్యాయని, ఈక్రమంలో దాడులకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని న్యూడెమొక్రసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకురాలు బి.రమాదేవి పిలుపునిచ్చారు. సంఘ సంస్కర్త, ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతిని ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద న్యూడెమొక్రసీ, స్వేచ్ఛ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో రాచర్ల బాలరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భాగ్యరెడ్డివర్మ 14వ సంవత్సరం నుంచే సాంఘిక దురాచారాలపై పోరాడడానికి ముందుకొచ్చారని గుర్తుచేశారు. మతతత్వ రక్షణ పేరుతో భజరంగ్‌దళ్, బీజేపీ, దాని అనుబంధ సంఘాలు దాడులకు తెగబడుతూ, హత్యలు, అత్యాచారాలకు ఒడిగడుతున్నాయని వాపోయారు. అనంతరం, భాగ్యరెడ్డి జీవిత చరిత్రను టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి వివరించారు. కార్యక్రమంలో నలిగంటి రత్నమాల, గంగుల దయాకర్, టీపీటీఎఫ్ జిల్లా నాయకడు బైరి స్వామి, అడ్వకేట్ తీగల జీవన్, బండి కోటేశ్వర్ రావు, మైదం పాణి, వీరస్వామి, ఐలయ్య, అరూరి కుమార్, అక్బర్, కృష్ణ, హరిబాబు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

కాశిబుగ్గ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యారా ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అధ్యక్షతన ఏసిరెడ్డినగర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రైవేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. విద్యార్థి లోకమంతా ఏకమై పోరాటాలు చేయాలని సూచించారు. అనంతరం, ఎస్ఎఫ్ఐ కరీమాబాద్ ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంచనగిరి సాయిరాం, కార్యదర్శిగా రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

నిరుద్యోగులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న భరత్, బాలచంద్ర

హన్మకొండ: నిరుద్యోగులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిట్టిమల్ల కుషాల్ భరత్, శ్రీకృష్ణ తెలిపారు. హనుమకొండ సుబేదారిలో నిరుద్యోగ నివారణ ఫౌండేషన్, అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుషాల్ భరత్, శ్రీకృష్ణ మాట్లాడుతూ శివరాత్రిని పురస్కరించుకుని 21 రోజుల పాటు శ్రీకృష్ణ డ్రైవింగ్ స్కూల్ సహకారంతో ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు లైసెన్స్ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. తాము చేపట్టిన ఈ కార్యానికి అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర సంపూర్ణ సహకారం అందిస్తున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు 93907 54965 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తులకు పండ్లు, పులిహోర పంపిణీ



పండ్లు, పులిహోర, మంచినీళ్ల బాటిళ్లను అందజేస్తున్న నిర్వాహకులు

కాజీపేట రూరల్: కొమురవెల్లి కాంతయ్య, రవికుమార్ చారి జ్ఞాపకార్థం కాజీపేట బాపూజీనగర్ మెయిన్‌రోడ్డులో సాయితేజ ఉడ్ ఫర్నిచర్ కొమురవెల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు పులిహోర, వాటర్ బాటిళ్లు, అరటిపండ్లు, క్యాలెండర్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ కొమురవెల్లి బ్రదర్స్ ఉమ్మడి కుటుంబ సభ్యులు ఐక్యంగా ఉంటూ సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిర్వాహకుడు రమేష్ మాట్లాడుతూ ప్రతీ ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కొమురవెల్లి బ్రదర్స్ రాజేందర్, కవిత, రాంమూర్తి, శ్రీదేవి, శ్రీనివాస్, రేఖ, రమేష్, కల్పన, ప్రమీల, దీపిక, నాంపెల్లి వెంకటేశ్వర్లు, సిబ్బంది రమేష్, నగేష్, సురేష్, శ్రీధర్, శ్రీను పాల్గొన్నారు.

గవర్నర్ తమిళిసైకి ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సీపీ

కాజీపేట అర్బన్: ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ హయగ్రీవచారి మైదానంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మహాశివరాత్రి సాంస్కృతిక సమ్మేళనానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ విచ్చేశారు. ఈ సందర్భంగా తొలుత నిట్‌లోని కలాం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న సందర్భంగా గవర్నర్‌కు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ ఏవీ.రంగనాథ్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. గవర్నర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, తదితరులు ఘనంగా సన్మానించారు.

కాశీ విహారయాత్రకు కూరగాయల మార్కెట్ వ్యాపారులు



కాశీయాత్రకు వెళ్లిన మార్కెట్ వ్యాపారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల కమీషన్ వ్యాపారుల పరపతి సంఘంలో సభ్యులు 12రోజుల పాటు కాశీ విహారయాత్రకు తరలివెళ్లారు. ఈమేరకు కాశీలోని కాశీ విశ్వేశ్వరుడిని శనివారం దర్శించుకున్నట్లు సంఘం అధ్యక్షుడు బుద్దపల్లి శ్రీనివాస్ తెలిపారు. 2015లో కమీషన్ వ్యాపారస్తుల పరపతి సంఘం స్థాపించి 8ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విహార యాత్రకు వెళ్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ ఆర్థిక ఇబ్బంది పడుతున్న సమయంలో సంఘం ఏర్పాటు చేసుకుని తక్కువ వడ్డీకి రూ.2.50లక్షల వరకు రుణం, మృతి చెందిన సభ్యుడి కుటుంబానికి రూ.50వేలు అందిస్తున్నట్లు వివరించారు. కాశీ యాత్రలో వ్యాపారులు కుమారస్వామి, బాబురావు, రవీందర్, రవి, యాదగిరి, భద్రయ్య, రాజు, కాసర్ల రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణం ప్రమాదం



వ్యతిరేక దిశలో వెళ్తున్న ఆటో

కాజీపేట: కాజీపేట పట్టణంలోని వివిధ కాలనీలకు వెళ్లే దారుల్లో నిత్యం వ్యతిరేక మార్గంలో పలువురు వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో ఎదురుగా వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహమత్‌నగర్, కాజీపేట చౌరస్తా, డీజిల్ కాలనీ పరిసర ప్రాంతాల్లో చాలామంది వ్యతిరేక మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. తక్షణమే ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

హన్మకొండ: స్వేచ్ఛ కోసం భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని స్వేచ్ఛ జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ నల్లెల రాజయ్య, విరసం జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 84వ జయంతిని శనివారం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ పాఠంలోని యథార్థాన్ని బోధించడమే నేరంగా మనువాదులు దాడులకు దిగడం శోచనీయమని వాపోయారు. సంఘ సంస్కరణ భావాలను సమాజంలో విస్తృత స్థాయిలో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశారని వివరించారు. దళితుల జీవితాల్లో మార్పు రావడానికి చదువే మార్గమని చైతన్యం చేసిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో శంకర్‌రావు, సంపత్ కుమార్, రాజేందర్, హరికృష్ణ, బ్రహ్మాచారి, వీరస్వామి, పిట్ట సాంబయ్య, నున్నా అప్పారావు, ఎస్.రాజమౌళి, జ్యోతి, సందీప్, పాల కుమారస్వామి, వి.దిలీప్, హరికృష్ణ, వెంకటనారాయణ, ఎస్.తిరుపతి, సిహెచ్.లక్ష్మయ్య, రావుల రమేష్, జి.ఎస్.సత్యనారాయణ, పాణి, జయంత్, ఎం.తిరుపతి, అమృతరాజ్, బి.మొగిలి, సిహెచ్.లక్ష్మయ్య, ఎన్.సురేందర్, భీం, బుజ్జి, బి.జ్ఞానప్రకాశ్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడలు దోహదం



పరిచయం చేసుకుంటున్న మర్రి యాదవరెడ్డి

కేయూ క్యాంపస్: క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు దోహద పడుతాయని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అన్నారు. భారత రాష్ట్రసమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ), కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ముఖ్యఅతిథిగా మర్రి యాదవరెడ్డి పాల్గొని ఆటలను ప్రారంభించి మాట్లాడారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతిఏటా క్రికెట్ పోటీలు నిర్వహించటం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫరూఖ్, జిల్లా అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, బీఆర్ఎస్వీ నాయకులు వీరేందర్, అస్లాం, వీరు, రాకేష్, పరశురాములు, రాంబాబు, తిరుపతి, నరేంద్ర, ప్రవీణ్, స్నేహిత్, రోహిత్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ రద్దు

- 24న నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న లింగంపల్లి కిషన్‌రావు

హసన్‌పర్తి: ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు వెల్లడించారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారంలోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2008లో చెట్టుపల్లి శివాజీని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. అయితే, 14 ఏళ్ల పాటు ఈ కమిటీ పనిచేసిందని గుర్తుచేశారు. కమిటీ పదవీ కాలం పూర్తయినందున అధ్యక్షుడితోపాటు రాష్ట్ర కమిటీలో ఉన్న అన్ని పదవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, ఈనెల 24న హైదరాబాద్‌లో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు స్టీరింగ్ కమిటీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాస్, అంజయ్య, మోహన్‌రావు, శ్రీధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.